# 5. మయిపోరుల్ నాయనారు

పరమ పవిత్ర మూర్తి అయిన మయిపోరుల్ నాయనారు - కొండకోనల ప్రాంత మైన సేతి ప్రజలకు రాజు. చాలాయుద్ధాలుచేసి అన్ని యుద్ధాలలోను విజయుడయ్యాడు. అతని రాజ్యంలో శాంతి, సుఖ, సంతోషాలు వెల్లివిరిశాయి. పంటలు పుష్కలంగా పండా యి. ప్రజలు ఆయనను దేవుడుగా కొలిచేవారు.

రాజుగారు ఆగమాలలో నిష్ణాతుడు. పరమశివుని అత్యంత భక్తుడు. ఆయనకు శివుడన్నా, రుద్రాక్షలు, జడలుకట్టిన శివభక్తులన్నా - వారు సత్యానికి కేవలము ప్రతిరూపు లని, పరమ సత్యమని మిగతా ప్రపంచమంతా (గడ్డి) పఱక అని నమ్మేవాడు. ఆయనకు అంతా శివమయంగా కన్పించేది. రాజ్యంలో శివభక్తులు సంపూర్ణ స్వాతంత్ర్య మనుభవిం చారు. వారిని రాజుగారు, ప్రజలంతా గౌరవించేవారు. రాజుగా - రాజ్యాన్ని పాలించినా - రాజుగారి మనస్సంతా దేవుని పాదాలు మీదనే వుండేది. ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు చేయించేవాడు. గుళ్లల్లో పండుగలు జరిపించేవాడు.

నాయనారు ఖ్యాతి చాలదూరము విస్తరించింది. ప్రక్కదేశానికి రాజైన ముత్తునా థన్‌కి నాయనారుమీద ఈర్ష్య ప్రబలింది. అతను పెద్ద సైన్యాన్ని సమకూర్చుకొని ఆ సైన్యం తో నాయనారు మీద పెక్కు పర్యాయములు దండెత్తాడు. కాని ప్రతిసారి అపజయం ఎదురైంది. అందుకని ముత్తునాథన్ కుట్రపన్నాడు. నాయనారుకు శివయోగులమీద అత్యంత భక్తి. ఇది తెలిసికొని ఒక రోజు శివయోగి వేషము దాల్చి - రాత్రివేళ రాజుగారి నివాసానికి వెళ్లాడు ద్వారపాలకులు శివయోగి కాబట్టి అతణ్ణి అడ్డగించలేదు. నాయ నారు కో ధాతన్ అను ఒక బుద్ధిశాలి, నమ్మకస్తుడైన సేవకుడున్నాడు. రాజుగారి పడక గదిని ధాతన్ కాపాలా కాస్తున్నాడు. శివయోగి రాజుగారి పడకగదిని సమీపించగానే - ధాతన్ రాజుగారు నిద్రిస్తున్నారు. లేపవలదండి అని శివయోగిని ప్రార్థించాడు. శివయోగి వినలేదు "రహస్య శాస్త్రము ఆయనకు (రాజుకు) అందజేయవలసివుంది. నన్ను అడ్డగిం

చకు. నేను వేచియుండలేను." అని శివయోగి అన్నాడు. ధాతన్ ఆయనను లోనికి వెళ్ల నిచ్చాడు. రాజుగారి భార్యలేచి ఒక శివయోగి పడక గదిలో ప్రవేశించుట చూచి భర్తను వెంటనే నిదుర నుండి లేపింది. శివయోగి "శాస్త్రము అతి రహస్యమైనది. అని దేవునిచే చెప్పబడింది. ఒక్క రాజుగారే దీనిని విననర్హుడు." అని చెప్పాడు. రాజుగారు తక్షణమే భార్యను ఆగది నుండి పంపి శివయోగికి సాష్టాంగపడి రహస్యము వినుటకు సిద్ధప డ్డాడు.

రాజుగారి దగ్గఱ నున్న శివయోగి ఎవరో కాదు. ఈర్ష్యను పెంచుకున్న విరోధి యైన ముత్తునాథన్. ముత్తునాథన్ తన దుస్తులలో దాచిన కత్తిని తీసి రాజుగారిని పొడి చాడు. ఆ క్షణమే - శివయోగిని అనుమానిస్తున్న ధాతన్ గదిలో ప్రవేశించి - రాజుగారు నెత్తురు మడుగులో నున్నట్లు, ముత్తునాథన్ చేతిలో కత్తియున్నట్లు గమనించాడు.ధాతన్ వెంటనే కత్తితీసి ముత్తునాథన్‌ని చంపబోయాడు.చనిపోబోతున్న నాయనారు ధాతా ! ఆయన మనవాడు శివయోగి రూపంలో వున్నవాడు. అందుకని ఆయనను మనము గౌరవించవలె. ఆయనకి హాని చేయవద్దు. వెంటనే మన పొలిమేరవఱకు ఆయనను సాగనంపు. ఆయనకు అపకారం జరుగ కుండ చూడు" మన్నాడు. రాజుగారి ఆజ్ఞను శిర సావహించి - శివయోగి రూపంలోవున్న ముత్తునాథన్‌ని సాగనంపుతూంటే ప్రజలు జరి గింది విని ఆగ్రహము చెంది ముత్తునాథన్ పై బడ్డారు. ధాతన్ రాజుగారి ఆజ్ఞను తెలిపి ముత్తునాథన్‌కి ఎవరూ హాని చేయవద్దని నచ్చచెప్పాడు. రాజుగారి ఆజ్ఞను వారుమన్నిం చారు. రాజుగారి భక్తి తత్పరను నిష్ఠను అర్థము చేసికొన్నారు.

ఈ విధంగా ముత్తునాథన్ సురక్షితంగా తన దేశాన్ని చేరగలిగాడు. ధాతన్ తిరిగి రాజసౌధానికి వెళ్లి ముత్తునాథన్ సురక్షితంగా తన దేశాన్ని చేరిన వైనం తెలిపాడు.

ధాతన్ చెప్పినది విని - నాయనారు తన మంత్రులను, బంధువులను తన దగ్గఱ కు పిలిచి ఇలా చెప్పాఁడు.

“శివభక్తుల సేవ - మన కర్తవ్యము. ఏ పరిస్థితిలో నైనను వారిని గౌరవించాలి. పూజించాలి. మన ప్రజలను శివభక్తుల అడుగుజాడల్లో నడువమనండి. శివభక్తులతో దేశాన్ని నిండిపోనీయండి. వారి ఆశీస్సులతో దేశంలో సిరిసంపదలు వెల్లి విరుస్తాయి.”

ఈ మాటలంటూ రాజుగారు కళ్లుమూసుకొని పరమశివుని ధ్యానంలో మునిగిపో యారు.

వెంటనే పరమశివుడు రాజుగారి ఎదుట ప్రత్యక్షమై “నీభక్తికి నేను అలరితిని. నీ భక్తి నిరుపమానము. ప్రశ్నించకుండ, నా భక్తుల యెడ నీవుచూపిన అప్రతిమాన అను రాగం నభూతో నభవిష్యతి. హంతకునిలో గూడ నన్నే చూడగలిగావు. అందుకని దేవత లు గూడ ప్రవేశించలేని కైలాసంలో వుండుటకు నీవు అర్హుడవు. త్వరలో నాలోకానికి రమ్ము” అని ఆశీర్వదించి అంతర్ధానమయాడు.

మయిపోరూల్ నాయనారు గూడ కొలది కాలంలోనే కైలాసం చేరాడు.

****